నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, మంగళవారం 22 ఏప్రిల్ 2025 | JOGULAMBA GADWAL WANAPARTHY

దుబాయిలో చిక్కుకున్న వ్యక్తిని

స్వదేశానికి రప్పించండి

- ఎన్ఆర్ఐ ప్రతినిధులకు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఫోన్

మహబూబ్ నగర్ అర్బన్, ఏప్రిల్ 21 : మహబూబ్ నగర్ జిల్లా హన్వాడ మండలం పెద్దదర్పల్లికి చెందిన గోపాల్ దుబాయిలో చిక్కుకు పోయాడు. సోమవారం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ దుబాయిలోని ఎన్ఆర్ఐ ప్రతినిధి అయిన జీపీడీ ప్రిన్సిపల్ కార్యదర్శి రఘునందన్‌రావుకు ఫోన్ చేసి గోపాల్‌ను తిరిగి స్వదేశానికి తీసుకువచ్చే వేగంగా చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా దుబాయి ఎన్ఆర్ఐ అసోసియేషన్ అధ్యక్షుడు ఇష్తేకర్ అహ్మద్‌తో మాజీ మంత్రి మాట్లాడుతూ గోపాల్‌ను తీసుకొచ్చేందుకు అవసర మైన సహకారం ఇవ్వాలని కోరగా.. అతని సమస్య తెలుకొని పరిష్కరిస్తామని, ఆర్థికంగా అవసర మైన సహకారం అందించేందుకు కృషి చేస్తామని ఇష్తేకర్ మాజీ మంత్రికి హామీ ఇచ్చారు.

గులాబీ దళంలోకి కాంగ్రెస్ నేత

- బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వంశీని బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్, ఏప్రిల్ 21 : వనపర్తి మండలం రాజనగరం గ్రామ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు వంశీ సోమవారం జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి స్వగృహంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వంశీకి మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మనుగడ ఎక్కువ రోజులు కొనసాగదని , రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. బీఆర్ఎస్‌తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ప్రజలు గుర్తించారని రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీలోకి వలసలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం పార్టీలో చేరిన వంశీ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ తోనేఅభివృద్ధి సాధ్యమని అందుకోసమే బీఆర్ఎస్‌లో చేరినట్లు చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థుల గెలుపుకోసం తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వనపర్తి పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, గొర్రెల కాపరుల మాజీ జిల్లా అధ్యక్షుడు పందెం కురుమూర్తి యాదవ్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ విజయ్‌కుమార్, మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, పార్టీ అధ్యక్షుడు అంజయ్య, సింగిల్ విండో వైస్ చైర్మన్ బాల చంద్రయ్య యాదవ్, యూత్ అధ్యక్షులు కరుణాకర్, కుమ్మరి సత్తయ్య, బండి చంద్రయ్య, బుచ్చిబాబు, బాల స్వామి, వెంకటేశ్, రమేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వానికి రైతు గోస పట్టదా?

తడిసిన మిర్చి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు
- మానవపాడులో తడిసిన మిరప పంటను పరిశీలన

మానవపాడు,ఏప్రిల్ 21 : అకాల వర్షంతో తడిసిన పోయిన పంటలను పరిశీలించడానికి ఏఒక్క మంత్రికి సమయం లేదా అని అసలు ప్రభుత్వానికి రైతు గోస పట్టదా అని ఎమ్మెల్యే విజేయుడు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి కల్లాల్లో ఆరబోసిన మిరప, పొగాకు పంట తడిసి పోగా సోమవారం పంటలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అకాల వర్షంతో మిర్చి, పొగాకు పంట పూర్తిగా తడిసిపోయి నష్ట పోయిన వాటిని పరిశీలించకుండా భూభారతి, రైతు సదస్సుల పేరిట పర్యటనలు చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. అలంపూర్ నియోజకవర్గంలో పొగాకు, మిర్చి పంటలను వేలాది ఎకరాల్లో సాగు చేశారని రెండేండ్లుగా పంటలకు మద్దతు ధర లేక రైతులు శీతల గిడ్డంగుల్లో పంట నిల్వ చేసుకున్నారని, అవకాశం లేని రైతులు కల్లాల్లోనే నిల్వ చేసుకుని ధర కోసం ఎదురు చూస్తున్నారన్నారు. అకాల వర్షంతో తడిసిన పంటను చూసేందుకు ఏఒక్క నాయకుడు కానీ, అధికారి కానీ రాక పోవడం సిగ్గు చేటన్నారు. వర్షంతో నష్టపోయిన రైతుల జాబితా సిద్ధం చేసి అంచనాలు రూపొందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల పరిస్థితి మంత్రులు, ప్రభుత్వానికి కానీ పట్టలేదని అన్నారు. మిర్చి, పొగాకు రైతుల వద్ద ఉన్న పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని అలాగే నష్ట పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నియోజవర్గంలోని రైతుల సమస్యలను వ్యవసాయ శాఖ మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగే విధంగా చూస్తానని ఎమ్మెల్యే రైతులకు భరోసా ఇచ్చారు. ఎకరాకు రూ.2లక్షల వరకు పెట్టుబడి అయిందని మరోవైపు సరైన మద్దతు ధర లేక కల్లాల్లోనే నిల్వ ఉంచుకోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు ఎమ్మెల్యేకు వివరించారు. అమ్ముకోవడానికి ఎక్కడికి వెళ్లిన ధర లేకపోవడంతోనే మాకు ఈ పరిస్థితి దాపురించిందని, మిర్చి పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకునే విధంగా చూడాలని రైతులు ఎమ్మెల్యేతో వాపోయారు.

కార్యకర్తలు దండులా కదలాలి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్

పెబ్బేరులో రజతోత్సవ సభ పోస్టర్ విడుదల చేస్తున్న గట్టుయాదవ్

పెబ్బేరు, ఏప్రిల్ 21: వరంగల్‌లో ఈనెల 27వ తేదీన జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు కార్యకర్తలు, నాయకులు దండులా కదలిరావాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన పెబ్బేరు, శాఖాపురం, రంగాపురం, కంచిరావుపల్లి గ్రామాల్లో పర్యటించి జన సమీకరణపై పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వాల్ పోస్టర్‌లను విడుదల చేసిన మాట్లాడారు. 25ఏండ్ల బీఆర్ఎస్ పండుగకు ప్రతి గడపనుంచి తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ చరిత్రలో నిలిచిపోయేవిధంగా సభను నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకతతో ప్రజలే స్వచ్ఛందంగా సభకు వచ్చేందుకు ఆసక్తి కనబరుస్తున్నారని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా మీడియా సెల్ కన్వీనర్ నందిమల్ల అశోక్, జిల్లా నాయకులు కురుమూర్తి యాదవ్, విజయ్‌నాయుడు, పెబ్బేరు పట్టణ పార్టీ అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రాములు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ కరెస్వామి, నాయకులు సాయినాథ్, వెంకటేశ్, విశ్వ రూపం, శంకర్‌నాయుడు పాల్గొన్నారు.

కల్లాల్లో ధాన్యపు బస్తాలు

- పెద్దమందడి మండలంలో లారీల్లేక ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

పెద్దమందడి, ఏప్రిల్ 21 : రైతులు పండించిన ప్రతి గింజను కొనేందుకు ప్రభుత్వం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐకేపీ, సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసింది. పండించిన వరిధాన్యాన్ని కల్లాలకు తీసుకువచ్చి ఆరబెట్టి తూకాలు పట్టి బస్తాలకు నింపినప్పటికి లారీలు లేక కల్లాల్లోనే వేల కొద్దీ ధాన్యపు బస్తాలు దర్శనమిస్తున్న ఘటన వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని దొడ్డగుంటపల్లి గ్రామంతో పాటు ఆయా గ్రామాలలో చోటుచేసుకుంది. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం తమ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. కాంగ్రెస్ అంటేనే కష్టాలు అని మరోసారి రుజువు చేసుకుంది. గ్రామాలలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో రైతులు పండించిన ధాన్యాన్ని తూకాలు చేసి బస్తాలకు నింపినప్పటికి లారీలు రాక పోవడంతో కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యపు బస్తాలు నిల్వ ఉన్నాయి. ఒక్క దొడ్డ గుంటపల్లి గ్రామంలోని దాదాపు 4వేల బస్తాల వరకు నిల్వ ఉండడం గమనార్హం. ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా భారీ ఈదురు గాలులతో కూడిన వర్షానికి ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ వైఫల్యమా లేక అధికారుల నిర్లక్ష్యమో కానీ రైతుల పాలిట కాంగ్రెస్ ప్రభుత్వం శాపంగా మారింది. ప్రజా ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటున్న నాయకులు రైతులకు కష్టాలు పెడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక గ్రామంలోనే 4వేల బస్తాలు నిల్వ ఉన్నాయంటే మిగిలిన మండలంలోని మిగతా గ్రామాలలో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లారీలను ఎక్కువగా పంపించి రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని పలువురు రైతులు వేడుకుంటున్నారు.

పెద్దమందడి మండలం దొడ్డగుంటపల్లి కొనుగోలు కేంద్రంలో లారీలు లేక నిల్వ చేసిన ధాన్యపు బస్తాలు



వెంటాడుతున్న అకాల వర్షాలు

ప్రాధాన్యం తగ్గించి..

- ధాన్యం కొనుగోలు చేయని వైనం
- కొన్నది గోరంత.. కొనాల్సింది కొండంత
- కేంద్రాల వద్ద ఆరు బయటే నిల్వలు
- దళారుల పాలవుతున్న రెక్కల కష్టం
- అకాల వర్షాలతో రైతన్న ఆగం
- సీఎం సొంత జిల్లాలో దుస్థితి ఇదీ..

మహబూబ్ నగర్ ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : బహిరంగ మార్కెట్‌లో ధర లేకపోవడంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు పెద్దఎత్తున ధాన్యం తరలివస్తుంది.. టన్నుల కొద్దీ కేంద్రాలకు తరలించి కొనుగోళ్ల కోసం పడిగాపులు కాస్తున్నారు. కేంద్రాలకు పెద్దఎత్తున ధాన్యం చేరడంతో ఆరు బయటనే కుప్పలుగా పోస్తున్నారు. రైతుల ధాన్యాన్ని సకాలంలో కొనాల్సిన సర్కారు నిర్లక్ష్యం వహిస్తుండడంతో కొనుగోలు కేంద్రాల వద్ద పరిస్థితి దారుణంగా తయారైంది. మరోవైపు ఈదురు గాలులు.. అకాల వర్షాలతో రైతన్నలు కుదేలు అవుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఎక్కడికక్కడే..

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో వేల టన్నుల ధాన్యం కొనుగోలు లేక ఎక్కడికి అక్కడే ఆగిపోయాయి. జోగుళాంబ గద్వాల జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా ఒక్క కిలో ధాన్యం కూడా కొనలేదు. ఉమ్మడి జిల్లాలో వనపర్తి లో అత్యధికంగా ధాన్యం దిగుబడి వచ్చినా 12వేల టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. ఇక మిగతా జిల్లాల్లో కూడా ధాన్యం కొనుగోలు చేయక పోవడంతో రైతుల కష్టం దళారుల పాలవుతుంది. సర్కారు కొనకపోవడంతో బహిరంగ మార్కెట్‌లో అమ్ముదామంటే మద్దతు ధర లేక రైతులు విలవిలాడుతున్నారు. ప్రభుత్వం సన్నబియ్యానికి రూ.2,300 మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తోంది. అయితే బహిరంగ మార్కెట్‌లో మాత్రం సన్నబియ్యానికి అత్యధిక ధర రూ.2000 కాగా కనిష్ఠంగా రూ.1800 మాత్రమే ఇస్తామని వ్యాపారులు అంటున్నారు. రైతులు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఆశతో కేంద్రాలకు భారీగా తరలిస్తున్నారు. ఆశించిన స్థాయిలో కొనుగోలు లేకపోవడంతో నిరాశకు గురవుతున్నారు. మరోవైపు అకాల వర్షాలు ఈదురు గాలులు అన్నదాతలను కుదేలు చేస్తున్నాయి. అన్ని జిల్లాల్లో వారం రోజులుగా అకాల వర్షాలు వెంటాడుతున్నాయి. కొన్ని చోట్ల ధాన్యం కోతకు వచ్చిన దశలో వడగండ్లు పడి నష్టం సంభవిస్తుండగా.. మరోవైపు కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం అకాల వర్షానికి తడిసి ముద్దవుతుంది. ఇటు సర్కారు కొనకపోవడం అటు ధాన్యం తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. పలకరించే దిక్కు లేక రైతులు గోసపడుతున్నారు.

లక్ష్యం 3.40లక్షల మెట్రిక్ టన్నులు..
కొన్నది 12వేల టన్నులే..

వనపర్తి జిల్లాలో మొత్తం ధాన్యం కొనుగోలు కేంద్రాలు 481 కాగా ఇందులో 379 కేంద్రాలు ప్రారంభించారు. యాసంగి ధాన్యం కొనుగోలు లక్ష్యం 3.40 లక్షల టన్నులు కాగా ఇప్పటి వరకు 12 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. పెద్దమందడి మండలంలో ఓ రైతు 4000 బస్తాలను కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్లగా లారీలు లేవని నేపంతో అలాగే నిలిపి వేశారు. ఇక గద్వాల జిల్లాలో మొత్తం ధాన్యం కొనుగోలు కేంద్రాలు 69కాగా ఇప్పటివరకు రెండే కేంద్రాల ప్రారంభించారు. యాసంగి ధాన్యం కొనుగోలు లక్ష్యం 1,75,000 టన్నులు అయితే 200 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు.

పాలమూరులో 182 కేంద్రాలు

మహబూబ్ నగర్ జిల్లాలో 182 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా..కేవలం 7,782 టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. యాసంగి అంచనా ధాన్యం 1,76, 525 మెట్రిక్ టన్నులుగా ఉంది. నారాయణపేట జిల్లాలో 97 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించగా . యాసంగి ధాన్యం కొనుగోలు లక్ష్యం 1,50,000 మెట్రిక్ టన్నులు కాగా కేవలం 12వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు.

సర్కారు కొనదు.. అమ్మాలంటే ధర లేదు..

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కష్టపడి పండించిన సన్నబియానికి.. దొడ్డు బియ్యానికి బహిరంగ మార్కెట్‌లో దళారులు కుమ్మకై తక్కువ ధరలను నిర్ణయించారు. దీంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వ్యవసాయ మార్కెట్లకు తీసుకెళ్లిన ధాన్యానికి మద్దతు ధర కూడా రావడం లేదు. సర్కారు సన్నబియానికి మద్దతు ధర ఇచ్చి రూ.500 బోనస్ వస్తుందని ఆశతో తీసుకెళ్లిన కొనుగోలు చేయక పోవడంతో అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కనిష్ఠ ధర క్వింటాకు రూ.1800 కాగా గరిష్ఠ ధర రూ.2.200 పలుకుతోంది. ప్రభుత్వం మాత్రం సన్నబియానికి రూ.2,300 మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించింది. దీంతో సర్కార్ ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలకు క్యూ కట్టారు. కానీ కొనుగోలు లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సాక్షాత్తు సీఎం సొంత జిల్లాలోని రైతుల పరిస్థితి దారుణంగా తయారైంది దీని కంతటికీ సర్కారు నిర్లక్ష్యమే కారణమని విపక్షాలు విమర్శిస్తున్నాయి.

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి అకాల వర్షాలు దడ పుట్టిస్తున్నాయి. బోరుబావుల కింద విద్యుత్ కోతలు అధిగమించి రైతులు పంటలను కాపాడుకొని వాటిని అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే తేమ శాతం అంటూ కొనుగోళ్లకు అడ్డంకులు సృష్టిస్తున్నారు. అయినా రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యాన్ని ఆరబెట్టి అమ్ముకుందామని ప్రయత్నాలు చేస్తున్నారు. నిద్రాహారాలు మాని ధాన్యం కుప్పల వద్ద కళ్లు కాయలు కాసుకొని ఎప్పుడు కొంటారని ఎదురు చూస్తున్నారు. అయితే ప్రకృతి కూడా అన్నదాతలపై పగబట్టింది. వారం రోజుల నుంచి అకాల వర్షాలు, వడగండ్ల వాన బీభత్సం సృష్టిస్తోంది. ఇప్పటికే ఏడుగురు పిడుగుపాటుకు గురై చనిపోగా అనేక పశువులు మృత్యువాత పడ్డాయి. కొనుగోలు కేంద్రాలు, మార్కెట్లకు తెచ్చిన ధాన్యం వర్షార్పణం అవుతుంది. మరికొన్ని చోట్ల పొలంలోనే ఉండగానే వడగండ్లు పడి గింజలు నేలరాలి రైతులకు తీవ్ర నష్టానికి గురిచేస్తున్నాయి. ధాన్యం కొనుగోళ్లు అంతంత మాత్రమే జరుగుతుండడంతో రైతులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. మరోవైపు తడిసిన ధాన్యం కూడా కొనాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు.

నాగర్‌కర్నూల్ జిల్లాలో గింజ కొనలే..

నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇప్పటివరకు గింజ కూడా కొనకపోవడంతో రైతులు ఆందోళన చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 234 కొనుగోలు కేంద్రాలు ఉంటే ఇప్పటివరకు 210 కేంద్రాలను ప్రారంభించారు. ధాన్యం కొనుగోలు జరగకపోవడం తో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. అయితే జిల్లాలో ఈ యాసంగిలో కొనుగోలు చేయాల్సిన ధాన్యం 1,89,239 మెట్రిక్ టన్నులు అని అంచనా వేయగా ఇప్పటివరకు కొనుగోళ్లే ప్రారంభం కాకపోవడం గమనార్హం.

తడిసిన 3వేల బస్తాల ధాన్యం

నారాయణపేట, ఏప్రిల్ 21 : నారాయణపేట జిల్లా కేంద్రంలో సోమవారం సాయంత్రం అరగంట పాటు ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షానికి వ్యవసాయ మార్కెట్ యార్డులోని 3వేల బస్తాల ధాన్యం సంచులు తడిచిపోయాయి.

జాజాపూర్‌లో ధాన్యం నుంచి నీటిని తోడేస్తున్న రైతు

ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రైతులు తమ ధాన్యాన్ని వ్యాపారులకు విక్రయించారు. వ్యాపారుల నుంచి ఖరీదుదారులు ధాన్యం కొనుగోలు చేసేందుకు టెండర్లు కూడా వేశారు. విషయం తెలుసుకున్న మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి మార్కెట్ యార్డుకు చేరుకొని ఈరోజు పలికిన ధరకే రేపు ఖరీదుదారులు తడిచిన ధ్యాన్యాన్ని ఎండబెట్టి కొనుగోలు చేసేందుకు ఒప్పించారు. కాగా వర్షం వచ్చే సమయంలో టార్పాలిన్లను కప్పినా పెద్దఎత్తున వీచిన గాలులకు అవి ఎగిరిపోయి ధాన్యం తడిచి పోయింది.

మహ్మదాబాద్ మండలంలో వర్షంలో కొట్టుకుపోతున్న వడ్లను ఎత్తుతున్న రైతు

కోడేరు శివారులో నేలరాలిన మామిడి

మహ్మదాబాద్ మండలం కంచన్‌పల్లిలో వాన నీటిలో కొట్టుకుపోతున్న ధాన్యం సేకరిస్తున్న రైతు మారుతి

బిజినేపల్లి మండలంలో దెబ్బతిన్న మక్కను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అకాల వర్షం రైతన్నను ఆగమాగం చేసింది. ఆరు నెలల కష్టం ఒక్క అరగంటలో తుడిచిపెట్టేలా చేసింది. సోమవారం సాయంత్రం గాలివానతో బీభత్సం సృష్టించింది. పలు చోట్ల తీరని నష్టాన్ని మిగిల్చింది. మహబూబ్‌నగర్ జిల్లా మహ్మదాబాద్ మండలంలో కురిసిన వానతో ధాన్యం తడిసింది. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే వరుణదేవుడు ఆగ్రహంతో రైతులకు తీరని నష్టం ఏర్పడింది. మండలంలోని వెంకట్‌పల్లి, మహ్మదాబాద్ కొనుగోలు కేంద్రాల్లో ఉన్న 600 బస్తాల ధాన్యం తడిసి ముద్దయింది. అలాగే నారాయణపేట జిల్లాలో 3 వేల బస్తాలు తడిసి ముద్దయ్యాయి. ఒక్కసారిగా వచ్చిన వర్షంతో ధాన్యం కుప్పలుగా చేసి కవర్లు కప్పేందుకు యత్నించినా ఫలితం లేకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. తడిసిన ధాన్యం ఏమి చేయాలో పాలుపోక మదనపడుతున్నారు. అలాగే ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కురిసిన వర్షానికి సైతం పెద్ద ఎత్తున పంటలు దెబ్బతిన్నాయి. అధికారులతోపాటు బీఆర్ఎస్ నాయకులు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ప్రభుత్వ పరంగా నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని పలువురు డిమాండ్ చేశారు.

– మహబూబ్‌నగర్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

అర్ధగంటలోనే

అతలాకుతలం

- అకాల వర్షంతో తడిసిన ధాన్యం
- పేట, మహ్మదాబాద్ రైతులకు నష్టం
- కళ్లాల్లోనే ముద్దయిన 3,600 బస్తాలు
- మిగతా ప్రాంతాల్లోనూ వర్షార్పణం

వడ్లు తడుస్తుంటే కన్నీళ్లొచ్చాయ్

వెంకట్‌రెడ్డిపల్లి కొనుగోలు కేంద్రానికి నేను తీసుకొచ్చిన వడ్లు వర్షం నీళ్లలో కొట్టుకుపోయాయి. తేమ శాతం ఉన్నా బస్తాలు ఇవ్వ లేదు. కొనడానికి చాలా ఆలస్యం చేస్తున్నారు. కష్టపడి పండించిన పంట నీళ్లలో కొట్టుకుపోతుంటే కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఒక్కడినే వర్షంలో వడ్లు నానకుండా కాపాడుకునే ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది.

- చాకలి బసయ్య, కంచన్‌పల్లి

ఎస్ఎల్‌బీసీలో ముగిసిన మృతదేహాల అన్వేషణ

- డేంజర్ జోన్‌లోనే మృతదేహాలు
- కొనసాగుతున్న మిగిలిన సహాయక చర్యలు
- మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించే అవకాశం

అచ్చంపేట, ఏప్రిల్ 21 : దోమలపెంట శ్రీశైలం ఎడమగట్టు (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్‌లో జరిగిన ప్రమాదంలో మిగిలిన ఆరుగురి మృతదేహాల వెలికితీతకు అన్వేషణ ముగిసింది. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ లో ప్రమాదం జరిగి సోమవారం నాటికి 59రోజులు పూర్తయ్యింది. ఆరుగురి మృతదేహాలు డేంజర్‌జోన్‌లోనే ఉన్నాయని భావిస్తున్నారు. డేంజర్ జోన్‌లో తవ్వకాలు జరుపడానికి అవకాశం లేనందున అక్కడి వరకు తవ్వకాలు జరిపి మృతదేహాల కోసం అన్వేషణ చేసినా ఫలితం లేకుండాపోయింది. దీంతో మిగిలిన డేంజర్‌జోన్ 43మీటర్లు పరిధి లో మృతదేహాలు ఉంటాయని అంటున్నారు. డేంజర్‌జోన్‌లోకి వెళ్తే సహాయక సిబ్బంది ప్రాణాలకే ముప్పు కావడంతో ఆశలు వదిలేశారు. డేంజర్ జోన్‌లోకి వెళ్లకుండా ప్రమాదకర పరిస్థితి ఏర్పడడం తో మృతదేహాల వెలికితీత ఎలా? అనేది ఈ నెల 24న హైదరాబాద్‌లో జరిగే టెక్నికల్, నిపుణుల కమిటీ తేల్చనున్నది. అంతవరకు టన్నెల్‌లో మిగిలిన మట్టి, బురద, స్టీల్, రాళ్లు తొలగింపు పనులు కొనసాగించనున్నారు. అయితే మృతదేహాల కోసం అన్వేషణ డేంజర్ జోన్ మినహా మిగిలిన ప్రదేశాల్లో ముగిసింది. టెక్నికల్ కమిటీ తదుపరి చర్యలపై సమీక్షించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నది.

43మీటర్లు డేంజర్ జోన్

టన్నెల్ లోపల చివరనా 43మీటర్లు డేంజర్ జోన్‌గా గుర్తించారు. అక్కడ డేంజర్‌జోన్ బోర్డుపెట్టి కంచె ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 58రోజులుగా రెస్క్యూ సిబ్బంది టన్నెల్ లోపల శ్రమించి 261మీటర్ల వరకు శిథిలాలు, బండరాళ్లు, మట్టి, బురద, టీబీఎం మిషన్ విడి భాగాలు, స్టీల్ కత్తిరింపు, కన్వేయర్ బెల్టు, లోకోట్రైన్ ద్వారా బయటకు తరలించారు. కన్వేయర్ బెల్టును పునరుద్ధరించి శిథిలాలు బయటకు తరలించారు. ఇప్పటికే చాలా మంది సిబ్బంది వెళ్లిపోయారు. ప్రస్తుతం 180 నుంచి 200 మంది వరకు రెస్క్యూ సిబ్బంది మాత్రమే ఉన్నారు. ప్రత్యేక అధికారి శివ శంకర్ లోతేటి వ్యక్తిగత పనుల నిమిత్తం ఢిల్లీకి వెళ్లినట్లు సమాచారం.

ఆటంకాల మధ్య రెస్క్యూ ఆపరేషన్

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ఫిబ్రవరి 22న జరిగిన ప్రమాదంలో 8మంది చిక్కుకొని సజీవసమాధి అయ్యారు. వారికోసం కేంద్ర, రాష్ట్రాలకు 12 విభాగాలకు చెందిన 600మంది మూడు షిఫ్టులుగా సహాయక బృందాలు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగించారు. ఈక్రమంలో 16వ రోజు గురుప్రీత్‌సింగ్ మృతదేహం లభ్యంకాగా 33వ రోజు జేపీ కంపెనీ ఇంజినీర్ ఉత్తర ప్రదేశ్‌కు చెందిన మనోజ్‌కుమార్ మృతదేహం లభ్యమైంది. మిగిలిన ఆరుగురి మృతదేహాల కోసం నిరంతరం అన్వేషణ కొనసాగింది. మానవ అవశేషాలను గుర్తించడంలో దిట్ట అయిన కేరళ ప్రత్యేక జాగిలాలు క్యాడవర్ డాగ్స్ రంగంలోకి దిగిన పెద్దగా ప్రయోజనం లేకుండా పోయింది. సింగరేణి, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, ఆర్మీ, హైడ్రా, దక్షిణమధ్య రైల్వే, ర్యాట్‌హోల్ మైనర్స్ రెస్క్యూ బృందాలు కీలకంగా పనిచేశాయి

మృతుల కుటుంబాలకు మిగిలిన నిరాశ?

రాష్ట్ర సరిహద్దులు దాటి వచ్చి టన్నెల్ ప్రమాదంలో మృతిచెందిన కార్మికులు, ఇంజినీర్లు, మిషన్ ఆపరేటర్ల కుటుంబాలు చివరికి కడసారి చూపుకోసం నోచుకోలేక పోయాయి. ఎని మిది మందిలో ఇద్దరి మృతదేహాలు లభ్యంకాగా మిగిలిన ఆరుగురి మృతదేహాల కోసం కుటుంబాలు నిరంతరం ఎదురు చూసినా ప్రయోజనం లేకుండా పోయింది. ఎంతో ఆశతో బాధిత కుటుంబసభ్యులు తిండి నిద్రమాని ఎదురు చూసినా చివరికి ప్రభుత్వం మృతదేహాలు వెలికి తీయలేక చేతులెత్తేసింది. డేంజర్‌జోన్‌లోకి మృతదేహాలు వెలికి తీసేందుకు ఎలాంటి చర్యలు చేపడుతుందో చూడాలి. మొదటిసారి ప్రభుత్వం, మంత్రులు హెలికాప్టర్‌లో వచ్చి హడావుడి చేశారు. కొన్ని రోజుల తర్వాత అధికారులకు అప్పగించేశారు. అధికారులు, సహాయక సిబ్బంది అక్కడే ఉండి 24గంటల పాటు శ్రమించి అన్వేషణ పూర్తి చేశారు. మిగిలిన ఆరుగురి మృతదేహాలు లభించకపోవడంతో రెస్క్యూ ఆపరేషన్ సిబ్బం